క్లుప్తంగా

క్షేత్ర పర్యటనలతో పరిజ్ఞానం



సీ పోర్ట్‌ను సందర్శిస్తున్న ఆదిత్య విద్యార్థులు

గండేపల్లి: క్షేత్ర పర్యటనల ద్వారా పరిజ్ఞానాన్ని పొందవచ్చని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి అన్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులు శుక్రవారం క్షేత్రపర్యటన నిర్వహించారు. కాకినాడ సీ పోర్ట్‌ను ప్రత్యక్షంగా పరిశీలించారు. అధ్యాపకులు కె.వెంకటపద్మ, జి.నాగార్జున, ఎన్.కార్తికేయ శర్మ, బి. కామేశ్వరశర్మ, వై.శిరీష, పి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

'గ్రంథాలయ వేదిక ' జిల్లా కన్వీనర్‌గా కన్నబాబు ఎంపిక



కన్నబాబు

కిర్లంపూడి: ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస వేదిక జిల్లా కన్వీనర్‌గా ఎన్. కన్నబాబు ఎంపికయ్యారు. గ్రంథాలయాలకు పూర్వవైభవం తీసుకొంచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని కన్నబాబు శుక్రవారం తెలిపారు. ఈ నెల 27న విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సాహిత్య అకాడమి పురస్కార గ్రహీతలు, వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు సమక్షంలో రాష్ట్రస్థాయి గ్రంథాలయ పునర్వికాస సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. గ్రంథాలయ అభిమానులు, కవులు, రచయితలు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



తాళ్లూరు జగనన్న కాలనీలో విద్యుత్ స్తంభంపై ఒరిగిన లారీని లాగుతున్న జేసీబీ

గండేపల్లి: జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న జగనన్న కాలనీలో శుక్రవారం ప్రాణాపాయం త్రుటిలో తప్పింది. స్థానికుల కథనం ప్రకారం ... మండలంలోని తాళ్లూరు శివారున జగనన్న కాలనీలోకి ఇంటి పని నిమిత్తం టిప్పర్ లారీ ఇసుక తీసుకువచ్చింది. ఇసుకను అన్‌లోడ్ చేసేందుకు లారీ రివర్స్‌లో వెళుతుండగా వెనుకభాగంలో కుడివైపు చక్రాలు గోతిలోకి దిగబడిపోయాయి. పక్కనే ఉన్న విద్యుత్ పోల్స్‌కు లారీ ఆనుకోవడంతో జేసీబీ సహాయంతో లారీని బయటకు లాగారు. కాగా ఇసుక లోడుతో ఉన్న లారీ మరికొద్ది సేపు విద్యుత్ పోల్‌ను ఆనుకుని ఉంటే స్తంభం విరిగిపోవడంతో పాటు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయ్యి పెను ప్రమాదం జరిగేదని స్థానికులు తెలిపారు.

కార్యవర్గం ప్రమాణ స్వీకారం

కిర్లంపూడి: బీజేపీ మండల అధ్యక్షుడు శరకణం రాజబాబు అధ్యక్షతన కిర్లంపూడిలోని విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో శుక్రవారం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం ఇన్‌చార్జి దాట్ల కృష్ణవర్మ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పెహల్గాం ఉగ్రదాడి మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

గోకవరం: మండలంలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం రూ.6 లక్షల ఎంపీపీ నిధులతో చేతి బోరు సామగ్రి కొనుగోలు చేసినట్టు ఎంపీపీ సుంకర శ్రీవల్లి శుక్రవారం తెలిపారు. పలు గ్రామాల్లో చేతి పంపు బోర్లు మరమ్మతులకు గురైన నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వీటిని కొనుగోలు చేశామన్నారు. చేతిబోరు సామగ్రి కావాల్సిన ఆయా గ్రామాల సర్పంచులు మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి తీసుకోవాలని సూచించారు.

నాగేంద్ర చౌదరికి ఆదర్శరైతు అవార్డు



నాగేంద్రచౌదరిని శాలువాతో సత్కరిస్తున్న స్థానిక నాయకులు

గోకవరం: మండలంలోని మల్లవరంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న భారతీయ ధర్మపరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్రచౌదరికి ఆదర్శరైతు అవార్డు లభించింది. శుక్రవారం గ్రామంలో సర్పంచ్ యిడుదుల లక్ష్మీ చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత నాగేంద్రచౌదరి మాట్లాడుతూ గత ఐదేళ్లుగా గ్రామంలో పూర్తిగా సేంద్రియ విధానంతో పంటలు సాగు చేస్తూ తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులు సాధిస్తున్నామన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం సాగు చేయడం ద్వారా మానవాళికి నాణ్యమైన ఆహార ఉత్పత్తులను అందించవచ్చన్నారు. కార్యక్రమంలో యిడుదుల అర్జున్‌రావు, స్థానిక నాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

చివరిలో కలవరం

- ధాన్యం ఒబ్బిడికి రైతుల ఆపసోపాలు
- అకాల వర్షాలతో పంట ఒబ్బిడికి ఉరుకులు పరుగులు
- గిట్టుబాటు ధర కోసం రోడ్లు, ఖాళీ స్థలాల్లో ధాన్యం ఆరబోత



ఎ.కొత్తపల్లిలో ధాన్యం రాశులను టార్పాలిన్లతో కప్పుతున్న రైతులు

తొండంగి: అకాల వర్షాలతో అన్నదాతలకు కష్టాలు తప్పడం లేదు. ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట చేతికందే తరుణంలో రైతన్నకు ధాన్యం ఒబ్బిడి దినదిన గండంగా మారింది. ఈ ఏడాది పంపా రిజర్వాయర్ గేట్లు మరమ్మతుల కారణంగా రబీకి సాగునీటిని విడుదల చేయలేదు. దీంతో పలువురు రైతులు అపరాలు సాగు చేశారు. పీబీసీ, వ్యవసాయ బోర్లు పరిధిలో ఎనిమిది వేల ఎకరాల్లో రబీ వరిసాగు జరిగింది. వ్యవసాయ బోర్లు పరిధిలో ముందుగా వరినాట్లు పడిన నేపథ్యంలో పంట కాలం ముందుగానే పూర్తయ్యింది. వ్యవసాయ బోర్లు పరిధిలోని కొమ్మనాపల్లి, బెండపూడి, పి.ఇ.చిన్నాయపాలెం, సీతారాంపురం, రావికంపాడు, ఎ.కొత్తపల్లి, తొండంగి, శృంగవృక్షం, కృష్ణాపురం, పైడికొండ తదితర ప్రాంతాల్లో ఇప్పటికే పంటను రైతులు యంత్రాలతో కోత కోయించి ఒబ్బిడి చేసుకున్నారు. పీబీసీ పరిధిలోని కోదాడ, శృంవృక్షంపేట, ఏవీ నగరం, రావికంపాడు, కొమ్మనాపల్లి తదితర ప్రాంతాల్లో 50 శాతం మేర పంట కోతలు పూర్తవ్వగా మరో 50 శాతం విస్తీర్ణంలో వరి పంట కోత కోయాల్సి ఉంది.

జోరుగా కోతలు

పీబీసీ పరిధిలో వరి కోత పనులు జోరుగా సాగుతున్నాయి. కాగా గత పది రోజుల నుంచి బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో అకాల వర్షాలు కురుస్తున్నాయి. గడిచిన వారం రోజుల్లో నియోజకవర్గంలో ఏదొక ప్రాంతంలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. వాతావరణం అనుకూలతను బట్టి రైతులు వరికోత యంత్రాలతో పంటలను కోత కోయిస్తున్నారు. అకాల వర్షంతో వరికోత కోసిన ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెడుతున్నారు. గడియకో విధంగా మారుతున్న వాతావరణంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కూలీలతో ధాన్యం ఒబ్బిడి చేసుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. మరోపక్క వరికోత యంత్రాలతో కోయించిన ధాన్యం వెంటనే అమ్ముకుంటే బస్తా రూ.1250 వరకూ మాత్రమే ఇస్తామని దళారులు చెప్పండటంతో తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోలేక కల్లాల్లోనే ధాన్యాన్ని ఆరబెడితే గిట్టుబాటు ధర పలుకుతుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు. మరికొంత మంది రైతులు అడపాదడపా కురిసే వర్షాలకు పంటను ఒబ్బిడి చేయలేక తక్కువ ధరకే పంటను దళారులకు అమ్ముకుంటున్నారు. ఇప్పటికే ఎకరాకు వరినారు వేసిన దగ్గర నుంచి నాట్లు వేయడం, కలుపుతీత, తెగుళ్ల నివారణకు పురుగులమందు పిచికారీ, పంట కోత తదితర ఖర్చులు దాదాపు రూ.30 వేలకు పైగా అయ్యాయి. ప్రస్తుతం పలుకుతున్న ధర ఏమాత్రం తమకు గిట్టుబాటు కాదని రైతులంతా రోడ్లుపైనా, ఖాళీస్థలాల్లో ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. తేమ శాతం తగ్గిన అనంతరం గిట్టుబాటు ధర లభిస్తుందని గంపెడాశతో ఎదురు చూస్తున్నారు.



కోదాడలో రహదారిపైనే ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న రైతులు

మొక్కుబడిగా కొనుగోలు కేంద్రాలు

ప్రభుత్వం మొక్కుబడిగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, క్షేత్రస్థాయిలో తమకు గిట్టుబాటు ధర రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఆరుదల కలిగిన ధాన్యానికి గతేడాది రూ.1800 పైగా ఉంటే ఈ ఏడాది రూ.1450కు మాత్రమే అడుగుతున్నారని రైతులు తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది కూలీల ఖర్చులు అధికమయ్యాయని, ప్రస్తుత ధరకు అమ్మితే తీవ్రంగా నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

నాలుగు ఎకరాల్లో సాగు చేశాను



నేను నాలుగు ఎకరాల్లో రబీ వరిసాగు చేశాను. ఎకరాకు దాదాపుగా రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకూ పెట్టుబడి పెట్టాను. వరికోత యంత్రాలతో కోత కోయించి వెంటనే అమ్మితే తేమ ఉందన్న సాకుతో బస్తా రూ.1200కు కొనుగోలు చేస్తామని దళారులు అడుగుతున్నారు. దీంతో గిట్టుబాటు కాక రోడ్లుపైనే నాలుగు రోజులుగా ధాన్యాన్ని ఆరబెడుతున్నాను. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఆరబెట్టిన ధాన్యానికి మద్దతు ధర రూ.1800 వస్తేగాని గిట్టుబాటు కాదు.

-బుంగా బాబూరావు, రైతు, సీతారాంపురం

ధాన్యం సేకరణ ప్రారంభించాం



మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. రావికంపాడు, ఎ.కొత్తపల్లి, కొమ్మనాపల్లి తదితర ప్రాంతాల్లో 406 క్వింటాళ్ల ధాన్యం సేకరించాం. ఆరబెట్టిన ధాన్యానికి ఏ గ్రేడు రకానికి రూ.1740 (75 కిలోలకు), సాధారణ రకానికి రూ.1725 (75 కిలోలకు) మద్దతు ధర ఇస్తున్నాం. రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు. రైతుసేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 22 శాతం వరకూ తేమ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నాం.

-ఎస్.నరసింహం, వ్యవసాయశాఖాధికారి, తొండంగి

ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య



గుల్లా ఏడుకొండలు (ఫైల్)

గోకవరం: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో 28 మంది పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపడం హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ జగ్గంపేట లీగల్ అడ్వైజర్ గుల్లా ఏడుకొండలు అన్నారు. ఉగ్రదాడిని శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో ఖండించారు. భారతీయులపై ఇటువంటి దాడి జరగడం బాధాకరమన్నారు. దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. దేశాన్ని నాశనం చేయడం కోసం ఉగ్రవాద శక్తులు అరాచకాలకు పాల్పడుతున్నాయని, దేశప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

వైభవంగా భద్రకాళీ అమ్మవారి ఉత్సవాలు

తుని: స్థానిక రాజా కళాశాల మైదానంలో స్వయంభూ వెలసిన భద్రకాళీ అమ్మవారి గంధ అమావాస్య ఉత్సవాలు శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం కలశ స్థాపన, అమ్మవారి అలంకరణ, లలితా సహస్రనామ పారాయణం, సాయంత్రం కోలాటం, భజనలు నిర్వహించారు. శనివారం ఉదయం అమ్మవారికి నిత్య పూజలు, లలితా, విష్ణుపారాయణ, సాయంత్రం గరగల సంబరాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

మండలాభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి



ఎంపీపీ తోట రవితో పాటు ఎంపీటీసీలు, సర్పంచులను సన్మానిస్తున్న అధికారులు

కిర్లంపూడి: మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ తోట రవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ హెచ్.హరికృష్ణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇటీవల నూతనంగా నిర్మించిన గోకులం షెడ్ల బిల్లులు పెండింగ్, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, ఇరిగేషన్ గట్లపై ఆక్రమణలు తదితర సమస్యలపై ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా ఎంపీపీ తోట రవి మాట్లాడుతూ మండలంలోని ప్రజా సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం ఇటీవల 10వ తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అత్యధిక మార్కులు వచ్చిన నలుగురు విద్యార్థులను సన్మానించారు.

ఎంపీటీసీలు, సర్పంచులకు సత్కారం

నేషనల్ పంచాయతీ రాజ్ మహోత్సవాలను పురస్కరించుకుని ఎంపీపీ తోట రవితో పాటు ఎంపీటీసీలు, సర్పంచులను అధికారులు శాలువా, పూలమాలతో సత్కరించారు. తహసీల్దార్ జె. చిరంజీవి, ఎంఈఓలు టి.జోసెఫ్, ఎం.చిన్నారావు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకుడు కోట వంశీ, పరిచారకుడు వేణు వ్రతపురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 20 మంది భక్తులు హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు కుంకుమ పూజలు

సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలోనూ, తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం గోపీ ఆధ్వర్యంలో పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రతి ఇంటిపై సోలార్ వ్యవస్థ ఉండాలి

డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: ప్రతి డ్వాక్రా మహిళ ఇంటిపై సోలార్ వ్యవస్థ ఉండాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.శ్రీనివాసరావు అన్నారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం ద్వారా డ్వాక్రా మహిళలు తమ ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్ వేయించుకుని, విద్యుత్ ఉత్పత్తి చేయాలని సూచించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీఎం, సీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల జీవనోపాధుల పెంపుపై ప్రగతి సాధించాలన్నారు. శ్రీనిధి ఉన్నతి సీఐఎఫ్ అప్పులకు సంబంధించిన బకాయిలు వసూలు చేయాలని సూచించారు. అనంతరం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సదరం రీ వెరిఫికేషన్ శిబిరాన్ని సందర్శించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆసుపత్రి ఆవరణలోని జనరిక్ మందుల షాపును తనిఖీ చేశారు. గ్రామంలోని దేవీ ఎంబ్రాయిడరీ యూనిట్‌ను సందర్శించారు. పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం వై.వెంకట్, సీసీలు శ్రీనివాస్, నూకరత్నం, నాగేశ్వరరావు, వీఓఏలు కళ్యాణి, భవాని, గంగాభవాని, వరలక్ష్మి, ప్రియాంక, సత్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తి భానుకు సత్కారం



బదిలీ అయిన ప్రత్తిపాడు కోర్టు న్యాయమూర్తి కాటం భానును సత్కరిస్తున్న న్యాయవాదులు

ప్రత్తిపాడు: న్యాయవాద వృత్తి పవిత్రమైందని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కాటం భాను అన్నారు. న్యాయవాదులు అంకిత భావంతో పనిచేస్తే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. ప్రత్తిపాడు కోర్టు న్యాయమూర్తి కాటం భాను అనంతపురం జిల్లా కల్యాణదుర్గం కోర్టుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తి భానుకు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సభలో న్యాయమూర్తి కాటం భాను మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు ఆధ్వర్యంలో న్యాయవాదులు న్యాయమూర్తి భానును శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో కోర్టు ఇన్‌చార్జి జడ్జి జి.బుల్లెమ్మ, ఐలాజ్ రాష్ట్ర ప్రతినిధి బుగత శివ, సీనియర్ న్యాయవాదులు కొల్లా వీర్రాజు, బార్ ప్రతినిధులు ఆదారి సుగుణ, పాలాట్ల కాశీ ప్రసాద్, మల్లేశ్వరరావు, అవసరాల దేవి, నరసింహరావులతో పాటు పోలీసులు, న్యాయవాద గుమస్తాలు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం

ప్రత్తిపాడు రూరల్: సాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని సుబ్బారెడ్డి సాగర్ సాగునీటి సంఘం అధ్యక్షుడు ఇళ్ల అప్పారావు అన్నారు. మండలంలోని ఏలూరులో వెంకటపతిరాజు చెరువు పంట కాలువల్లో పూడిక తీత పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటపతి రాజు చెరువు నుంచి ప్రత్తిపాడు వరకూ తొమ్మిది కిలోమీటర్ల మేర పూడిక తీత పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇరిగేషన్ డీఈ రాజేంద్రప్రసాద్, ఏఈఈ ఇబ్రహీం, ఏలూరు, టి.రాయవరం సర్పంచులు రొంగల సత్యనారాయణ, తటవర్తి సుబ్బారావు, స్థానిక నాయకులు అడ్డాల త్రిమూర్తులు, మదినే వెంకన్నదొర పాల్గొన్నారు.

తీవ్రవాదులపై పోరాటానికి మేము సిద్ధం



ఎ.మల్లవరంలో కొవ్వొత్తులు ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు



జగ్గంపేటలో నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

- ఉగ్రదాడిని ఖండించిన ముస్లింలు
- మసీదులో నల్లబ్యాడ్జీలతో నిరసన

జగ్గంపేట: పహల్గాంలోని భారతీయ టూరిస్టులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు చేసిన మారణకాండ బాధాకరమని, పాకిస్తాన్, ఉగ్రవాదులపై భారత్ చేసే పోరాటానికి తాము సిద్ధమని స్థానిక ముస్లింలు అన్నారు. జగ్గంపేట జామియా మసీదులో శుక్రవారం ముస్లింలు నల్ల రిబ్బన్లు, జెండాలు చేతబూని ఉగ్రవాదుల దాడులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ మారణకాండలో మృతి చెందిన టూరిస్టు కుటుంబాలకు తీవ్ర సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ ఎస్ఎ గఫూర్ ఆధ్వర్యంలో పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ పహల్గాంలో మారణకాండ సృష్టించిన ఉగ్రవాదులను మట్టు పెట్టడానికి, దీనికి సహకరిస్తున్న పాకిస్తాన్‌పై కేంద్రం తీసుకునే కఠిన చర్యలకు తాము మద్దతు పలుకుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో జగ్గంపేట సున్ని జామియా మసీద్ కమిటీ అధ్యక్షులు షేక్ ఆరిఫ్, ఉపాధ్యక్షుడు డాక్టర్ బాషా, సెక్రటరీ షేక్ రెహమాన్, జాయింట్ సెక్రటరీ ఎండీ ఇబ్రహీం, ట్రెజరర్ షేక్ మొహిద్దీన్ మసీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



తునిలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఉగ్రదాడిని ఖండించిన ముస్లింలు

తుని: జమ్మకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని ముస్లింలు ముక్తకంఠంతో ఖండించారు. శుక్రవారం స్థానిక జామియా మసీదులో ప్రార్థనలు చేసిన ముస్లింలు మెయిన్ రోడ్డు శాంతి ర్యాలీ నిర్వహించారు. అమాయక ప్రజలపై ముష్కరులు దాడి చేసి 27 మందిని పొట్టన పెట్టుకున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపి కఠినంగా శిక్షించాలని ముస్లిం మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

రౌతులపూడి: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై పాక్ ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరశిస్తూ మండలంలోని ఎ.మల్లవరంలో లెక్కల రాము ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వొత్తులు ర్యాలీ నిర్వహించారు. ఈ దాడిలో అమరులైన వారికి నివాళులర్పించి, వారి కుటంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచి వేయాలని నినాదాలు చేశారు. అలాగే సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగతా బంగార్రాజు ఆధ్వర్యంలో ఉగ్రదాడిలో అమరులైన వారికి నివాళులర్పించారు. లిబరేషన్ నాయకులు సామిరెడ్డి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: పహల్గాం ఉగ్రదాడిలో మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ గండేపల్లిలో శుక్రవారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి జాతీయ రహదారి వరకూ ర్యాలీ చేశారు. మారణకాండకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా నల్లకొండమ్మతల్లి బోనాల పండగ



జి.కొత్తపల్లిలో అమ్మవారి బోనాలను ఊరేగిస్తున్న భక్తులు

శంఖవరం: గంధామావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని జి.కొత్తపల్లిలో నల్లకొండమ్మతల్లి బోనాల పండగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను గ్రామంలో ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. దారి పొడవునా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఈగల విజయదుర్గ, మాజీ జెడ్పీటీసీ ఈగల అప్పారావు, మాజీ సర్పంచ్ ఈగల దేవుళ్లు, గొంప శ్రీను, మటం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

తొండంగి: మండలంలోని ఒంటిమామిడిలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అన్నవరానికి చెందిన సత్యసింహ షుగర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో డాక్టర్ చిత్రారెడ్డి నిర్వహించిన వైద్య శిబిరంలో సుమరు 200 మంది ఉచితంగాగా వైద్య సేవలు అందించారు. రోగులకు షుగర్, బీపీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

జగ్గంపేటలో ప్రజాదర్బార్

జగ్గంపేట: స్థానిక రావులమ్మనగర్‌లోని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు సమస్యలపై వినతులను ఎమ్మెల్యే నేరుగా స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అధికారులు పాల్గొన్నారు.

మహమ్మారిని తరిమేద్దాం

- ఘనంగా ప్రపంచ మలేరియా దినోత్సవం
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు



ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



గోకవరం మండలం కొత్తపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఏలేశ్వరం: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని శుక్రవారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని ఏలేశ్వరం, జె.అన్నవరం పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మలేరియాకు కారణమైన దోమలను నిర్మూలించాలన్నారు. మలేరియా లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వాసుపత్రి, విలేజ్ హెల్త్‌క్లినిక్‌లకు వెళ్లి పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలన్నారు. మలేరియా సోకకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మలేరియా నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే మలేరియా నివారణ

కిర్లంపూడి: పరిసరాల పరిశుభ్రతతో మలేరియా వ్యాధిని తరిమికొడదామని స్థానిక పీహెచ్‌సీ వైద్యులు రాంబాబునాయక్ అన్నారు. ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆసుపత్రి సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మలేరియా బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేద్దాం

జగ్గంపేట: మండలంలోని రాజపూడిలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ఎస్.పూజ ఆధ్వర్యంలో గ్రామంలో మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ చేపట్టారు. మలేరియా నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గోకవరం: మండలంలోని కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు డాక్టర్ నిఖిత ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మలేరియా అంతం మనతోనే అంటూ నినాదాలు చేశారు. ఫ్రైడే డ్రై డే ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్లు మస్తాన్, పవన్, రమణ, అప్పారావు, ధన రాజు, నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.